# అభ్యుదయం అంచుల్లో....

"ఈ రోజు కొత్త ప్రిన్సిపాల్ జాయినవుతాడటా...." గాలి వేగంతో పరుగెత్తుకొచ్చింది వార్త.

ఏ వార్తయినా ముందు స్టాఫ్ రూం నాశ్రయిస్తుంది. అక్కడ కూలంకశంగా చర్చించబడి విద్యార్థి లోకానికి విడుదలవుతుందా డిగ్రీ కాలేజీలో, ఆ కాలేజీ ఆనవాయితీ అది.

"వేపకాయ రుచి తియ్యగా ఉండును. అనే మాటలో ఎంత నిజముందో ఇందులోనూ అంత నిజముంది" కట్టె పుల్ల విరిచేసినట్టు కొట్టిపారేశాడు ఎకనిమిక్స్ లెక్చరర్ అలెగ్జాండర్.

"నిజమే... ఎవ్వరికీ మింగుడు పడలేదు. ఇదో జోకయ్యుంటుంది" అస్తమానం జోకులు కట్‌చేస్తూ అందర్నీ అలరించే హిందీ లెక్చరర్ - ధర్మపాల్ గుడా నమ్మలేదు.

"ఎవ్వరేమన్నా .... ఈ వార్త నిజం. ఈ రోజు మన ప్రిన్సిపాల్ మారడం ఓ చారిత్రిక సత్యం...." ఖచ్చితంగా చెప్పేశాడు చరిత్ర లెక్చరర్ చంద్రకాంత్, తన ముందున్న బల్లను గట్టిగా గుద్ది చెయ్యి నొప్పి పుట్టింది కాబోలు మరో చేత్తో తడుముకున్నాడు వెంటనే. స్టాఫ్ రూం కా వార్త మోసు కొచ్చిందాయనే.

వార్తావాహిని తరంగాలు ఎంత ఎత్తు ఎగసినా ఎటునుంచి ఎటు పరుగెత్తి తల బాదుకున్నా - తెలుగు లెక్చరర్ హైమవతి స్పందించలేదు. కుటుంబ గాథా చిత్రం చూస్తున్న ప్రేక్షకురాలై పోయింది.

హైమవతి అందంగా ఉంటుంది. ఆమె కళ్ళు మంచుతో తుడిచి శుభ్రం చేయబడిన పద్మాల్లా శుభ్రంగా, విశాలంగా ఉంటాయి. పొడుగూ పొట్టీకాని ముక్కు, ముక్కుమీద మెరిసే ఒంటిరాయి ముక్కుపుల్ల, మెరిసే చెక్కిళ్ళు, అందరినీ ఆకర్షించగల నుదుటి తిలకం ఆమెకో ఉదాత్తత నాపాదిస్తుంది.

స్టాఫ్ రూంలో.... అంతగా అవసరమనిపిస్తే తప్ప నోరు విప్పదు. ఎప్పుడూ ఏవో ఆలోచనల్లో మునిగి తేలుతున్నట్టు చూపులు శూన్యంలోకి విసిరేసి కూచుంటుంది.

కవ్వింపూ, కలుపుగోలు తనం లేని హైమవతిని ఒంటరిగా వదిలెయ్యడమే మేలనిపించింది స్టాఫ్ మెంబర్స్‌కు,

* * *

" నమస్కారమండీ... నా పేరు హైమవతి.... తెలుగు డిపార్ట్‌మెంట్" ప్రిన్సిపాల్ ముందున్న అటెండెన్స్ రిజిష్టర్లో సంతకం చేసింది-తనకు తాను పరిచయం చేసుకుంటూ.

"నా పేరు రఘోత్తమరావు. కొత్తగా ప్రమోషన్ మీదొచ్చాను. నిన్న సాయంత్రం జాయినవడంతో అందరి పరిచయం కాలేదు" అరువు తెచ్చుకున్న చిరునవ్వులు అలంకరించుకున్న ప్రిన్సిపాల్ ఫైల్లోంచి బయటకొచ్చి తలపైకెత్తాడు.

"మీరూ... మీరూ..."

పరుగులు తీస్తూ షడన్‌గా ఆగిపోయిన ఆర్టీసీ బస్సులా ఆగిపోయింది చిరునవ్వు.

చూపులు కలవగానే ఇద్దరి మొహాల్లో రంగులు మారిపోతున్నాయి.

"మీరూ....మీరూ..."మళ్ళీ అడగాలనుకున్న ఉద్వేగాన్ని అతీత శక్తి ఏదో గొంతు పిసికేసింది"

"నేను....నేను...నేనే"

అంతకు మించి హైమవతి మెదడు పొరల్లో గుస గుస లాడే భావ తరంగాలేవీ మాటల రూపం దాల్చలేదు.

"గుడ్మార్నింగ్ సార్...వీరూ..."

అంతకు ముందురోజు రఘోత్తమరావొచ్చేదాకా కాలేజీలో ఉండి మస్కించడంలో ముందడుగు వేసిన కామేశ్వర్రావు హైమవతిని పరిచయం చెయ్యబోయాడు.

" పరిచయమే....థాంక్స్ " గుండెల్లోని పొంగులకు అడ్డుకట్ట వేసిన బలవంతపు చిరునవ్వు పెదాల మీద మెరిసింది.

"హైమవతిగారు చాలా రిజర్వుడుగా ఉంటారు, ఏ ఒక్క విద్యార్థీ వీరి క్లాసు ఎగ్గొట్టడు. టీచింగ్ ఆర్ట్‌లో వీరికి వీరే సాటి."

కామేశ్వర్రావు కాంప్లిమెంట్స్‌కూ, కలుపుగోలుతనానికి మనసులోనే జోహార్లర్పించింది హైమవతి.

" అలాగా సంతోషం!" అనక తప్పలేదు ప్రిన్సిపాల్‌కు.

" యువప్రాయందాటని మీరు ప్రిన్సిపాల్‌గా రావడం మా కాలేజీ అదృష్టం. బైదిబై ... మీరు ఫామిలీని తెచ్చుకోవాలి గదా... అద్దె ఇల్లు కొరకు వేట ప్రారంభిద్దామా సార్..."

"........?" కనుబొమలు ప్రశ్నార్థకాలైనాయి.

ప్రిన్సిపాల్‌ను మాటల్లోకి దింపడం - కుంభకర్ణున్ని నిద్రలేపే ప్రయత్నంలాగనిపించింది కామేశ్వర్రావుకు.

"ఏమండీ హైమవతిగారూ! మీరెప్పుడూ ఫ్రీగా మాట్లాడరు సరే....కాని ఇప్పుడన్నా రెండు మాటలు మాట్లాడండీ ...ప్లీజ్..." కదిలించే ప్రయత్నం చేశాడు కామేశ్వర్రావు. రెస్పాన్సు శూన్యమైంది.

మరో ఇద్దరు లెక్చరర్లు వచ్చి అటెండెన్స్ రిజిష్టరందుకున్నారు.

"నాకు క్లాసుంది ... వస్తా..." గిరుక్కుమంది హైమవతి.

వెనకాల ముడివేసిన ఆమె జుట్టు కొనలు పట్టుకుచ్చుల పువ్వుల్లా వీపు మీద నాట్యం చేస్తూ ప్రిన్సిపాల్ నుడికించాయి.

ఎన్నో సంవత్సరాల క్రితం విన్న మధుర మురళీనాదం మళ్లీ ఈ రోజు ఎదవీణను మీటినట్టనిపించిందతనికి.

"మీకెలాగన్పిస్తుంది సార్, మా కాలేజీ వాతావరణం?" మళ్ళీ కదిలించాడు కామేశ్వర్రావు - పట్టు వదలని అపర విక్రమార్కుడిలా.

"అప్పుడే ఏం తెలుస్తుందండీ: కాస్త సెటిలవ్వాలిగా! ఐనా....మీలాంటి సహృదయులున్న ఈ కాలేజీ వాతావరణం బాగానే ఉంటుందని సిక్త్స్ సెన్స్ చెబుతోంది."

రఘోత్తమరావు అసలు ధోరణి బయటపడింది. అనుకున్నదాన్ని అతి ప్రయత్నం మీద సాధించినట్టు ఇదైపోతున్న కామేశ్వరావు ఖుషీలో అక్కడున్న వాళ్లంతా భాగస్తులయ్యారు.

* * *

"ఏమండోయ్ ..మీరు తాత కాబోతున్నారు..." భర్త చెవిలో మెల్లిగా చెప్పింది అనసూయమ్మ—పది లక్షల రూపాయల లాటరీ తగిలినంత సంబర పడిపోతూ.

ఉదయం నుండి ఆయిల్ మిల్లు వ్యవహారాలతో విసిగి వేసారిన నాగభూషణం అలసట రపీన మాయమైంది. ఏదో సాధించానన్న సంతోషము ప్రాణవాయువులా పరుగెత్తి అతని ఛాతీని ఆరంగుళాలు విశాలం చేసింది.

"కొడుకూ, కోడలూ కలిసి ఎటో వెళ్లారు. ఓ గంటలో వస్తామన్నారు"

"ఔనూ... నాకో అనుమానం.....!"

"ఏమిటో...!?" కను బొమ్మలు పైకి లేచాయి.

"మన కోడలుకు ఎమ్మే డిగ్రీ ఉంది. అందమూ ఉంది. ఐనా — అణకువగా మెదుల్తూ అన్ని పనులూ చేసుకుపోతుంది. ఆ అమ్మాయికా సంస్కార మెలా అబ్బిందో...

"చదువు సంస్కారానికి మెరుగులు దిద్దుతుంది గదా! అది అణకువను గూడా నేర్పుతుంది. ఐనా పుట్టింటి వాతావరణ మలాంటిది. అంతా మన వాడదృష్టమండీ!"

స్కూటర్ దిగి లోపలికొస్తున్న కొడుకూ కోడల్ని గర్వంగా చూస్తూ "ఎక్కడికి కెళ్ళారా రాఘవా?" అడిగాడు.

కొడుకు పేరు రఘోత్తమరావని పెట్టినా రాఘవా అని పిలవడం అలవాటైంది తల్లి దండ్రులకు.

"డాక్టరు గారి దగ్గర కెళ్లాం నాన్నా!"

" ఏమంది డాక్టరమ్మ? పరీక్షలు చేసి మందులు రాసిచ్చిందా? " అనసూయమ్మ ఆతృతగా అడిగింది.

" మందులూ మాకు లెందుకమ్మా? మాకిప్పుడప్పుడే పిల్లలు వద్దనుకున్నాం. హైమకు అబార్షను చేయించాలనుకుంటున్నాను. డాక్టర్ పరీక్షలన్నీ చేసి రేపు రమ్మంది." కాజువల్‌గా చెప్పుకుపోయాడు.

" ఔనత్తయ్యా మేమే పిల్లలం గదా, మాకిప్పుడే పిల్ల లెందుకూ? " హైమవతి తాళం వేసింది.

అనసూయమ్మ సుందర స్వప్నం తాలూకు ఛాయలు మాయమైపోతున్నాయి.

నాగభూషణం నవనాడుల్లో పరుగులు తీస్తున్న ఉత్సాహం చప్పున కుప్ప కూలిపోయింది. మేజర్ ఆక్సిడెంట్‌కు గురైన అమాయకుడిలా కోపం, అసహ్యం అతలా కుతలం చేస్తున్నాయతణ్ని. కాని.... చెట్టంత కొడుకును మందలించడమెలా?

ఐదు నిమిషాలు గడ్డ కట్టుకు పోయినై.

"ఏం.... ఎందుకూ?" ఉబికొస్తున్న కోపాన్ని బలవంతగా అణచుకుంటూ ప్రశ్నించాడు,

" మీరింకా పిల్లలా? ఇదేమి చోద్యమమ్మా! అబార్షనంటే .... నేను చచ్చినా ఒప్పుకోను" అనసూయమ్మ గొంతులో పట్టుదల ప్రతిధ్వనించింది.

ఒకర్నొకరు అదోరకంగా చూసుకున్న యువ దంపతుల కళ్ళల్లో అభ్యుదయం అలుముకుంది- తమ నిర్ణయం ఇసుమంతైనా మారడానికి వీల్లేదని.

"ఒరేయ్! భ్రూణ హత్య మహా పాపంరా! కనదలచిన ఇద్దరు ముగ్గురు పిల్లల్ని త్వరగా కనేసి ఆ తర్వాత అపరేషన్ చేయించుకోవడం ఉత్తమం, ఎందుకంటే మీరు వృద్ధాప్యంలో అడుగు పెట్టేప్పుడు వాళ్ళు యవ్వనంలో కొచ్చేస్తారు. లేకపోతే.... మీ రెక్కలు మూలపడే సమయానికల్లా వాళ్ల రెక్కలు ఎదగవు. కాస్త దూరదృష్టితో ఆలోచించు" అంటూంటే నాగభూషణం నరాల్లో లావా ప్రవహిస్తూనే వుంది.

"నీ మొగుణ్ణీ, మొన్ననే పెళ్ళయిన మీ ఆడబిడ్డనూ అలాగే కన్నామమ్మా మేము. మా కాళ్లూ రెక్క లాడేటప్పుడే వాడి కుద్యోగం దొరికింది. ఎమ్మే చదివించిన తర్వాత ఇద్దరికీ పెళ్లిళ్లు చేయగలిగాం. మా ఆవేదననర్థం చేసుకోండమ్మా!" అనసూయమ్మ దేవేరించింది - గుండెలోని బాధనంతా నొక్కి పెడుతూ.

చెవిటివాడి ముందు శంఖమూదినట్లయింది. యువ దంపతులు కళ్ళతోనే మాట్లాడుకొని కదిలారక్కడనుండి.

మర్నాడే అబార్షన్ కార్యక్రమం ముగిసింది. ఐదు వసంతాలు హాయిగా గడిచాయి.

యువ దంపతుల కప్పటికే పిల్లలు కావాలనే కోరిక ఉదయించింది. రాను రాను బలం పుంజుకుంది. దేవుళ్ళకూ దయ్యాలకూ పూజలు తప్పకుండా జరుగుతున్నాయి. వారం వారం ఉపవాసం తప్పడంలేదు. హైమవతి మాత్రం నెల తప్పలేదు. డాక్టర్ పరీక్షలూ, మందులూ వగైరాలు ఆశలు పెంచాయే తప్ప ఆశయానికి చేరువకాలేదు.

"గొడ్రాలికి పిల్లలు పుడతారా....?"

"మూర్ఖపు ఆలోచన ముదనష్టపు పని చేయించింది..."

"ఇక ఆవిడకు కడుపు పండదు...."

"టింగు రంగా అంటూ పెళ్లాం మొగడే తిరుగుతున్నారు. పిల్లా పీచూ ఉంటే తిరుగలేరుగా—"

"ఇహ వీళ్ళ గతి ఇంతే...."

ఇరుగు పొరుగుల సూటి పోటి మాటలు, వ్యంగ్య వ్యాఖ్యానాలు హైమవతి గుండెల్లో పదునైన ఈటెలై గుచ్చుతున్నాయి.

అనసూయమ్మ తలెత్తుకు తిరగలేకపోతుంది.

నాగభూషణం ఆరాటం అంతా ఇంతా గాదు.

కొడుక్కు మళ్ళీ పెళ్లి చేసైనా సరే తమకు రెండో తరం పిండ ప్రదానం చేసే మనవడిని కళ్ళ జూడాలనిపించింది. తమ తల్లిదండ్రుల అభిప్రాయంలో ఇసుమంతైనా అన్యాయం కనిపించిలేదు రఘోత్తమ రావుకు.

హైమవతి ముందు ప్రస్తావించబడింది విషయం, గుండెలు బాదుకుంది భద్రకాళిలా లేచింది.

"అలా జరగడానికి వీల్లే"దని ఎగబడింది.

* * *

సినిమా రీళ్ళలా కళ్లముందు కదలిన గతం హైమవతిని నిద్రకు దూరం చేసింది. మనసంతా కలగాపులగమైంది. ఎంత వద్దనుకున్నా ఎదలో తుఫాను చెలరేగింది. అదృశ్య శక్తులేవో చుట్టూ తిరుగుతూ.... "ఇదంతా

నీ స్వయం కృత" మని వికటాట్టహాసం చేస్తున్నాయి. తెల్లవారకముందే లేచి పూజమీద కూర్చుంది.

ఎవరో తలుపు తడుతున్నారు. త్వరగా పూజ ముగించి వెళ్లి తలుపు తీసింది.

నిశ్చేష్టురాలైంది.

విభ్రమంగా చూసింది.

చడీ చప్పుడు లేకుండా ఆవహిస్తున్న నిస్సత్తువను అతి ప్రయత్నం మీద అణిచేసి నిలదొక్కుకుంది.

కొన్ని నిముషాలలాగే గడిచాయి,

ఎప్పుడు ఎలా ఊరినాయో కన్నీళ్లు కంటి చూపును మసగ్గా మార్చేస్తున్నాయి.

" లోపలికి రావచ్చా....?"

నిశ్శబ్ధంలోంచి దూసుకొచ్చింది రఘోత్తమరావు కంఠం.

అంతసేపతణ్ని గడపలోనే నిలబెట్టినందుకు తనమీద తనకే అసహ్యమేసింది.

"రండి కూచోండి!"అంటూ లోపలికి నడిచింది. కొంగుతో కళ్ళద్దుకుంటూ

"బాగున్నావా హైమా!"

"............"రాత్రి కలువల్లాంటి కళ్ళలోంచి వెల్లువలా దూసుకొస్తున్న కన్నీళ్లు గొంతు పెగలనివ్వలేదు.

"నామీద ఇంకా కోపం పోలేదా?"

"........" కాసేపు వెక్కి వెక్కి ఏడ్చాం తర్వాత తేలికైంది,

"మాట్లాడవా...?"

"కోపమా? కోపం మీ స్వంత ఆస్తి. మోసం మీ ప్రవృత్తి. మానాన్న పోయాడనే దుఃఖంతో నేను మా పుట్టింటి కెళ్తే, అదే సందని మీరు మరో పెళ్లి చేసుకున్నారు గదూ! కొత్త పెళ్ళాంతో స్వర్గ సుఖాల్లో తేల్తూ నన్ను నరకంలో తోసేసారు. కనీసం నన్ను చూసేందుకైనా వచ్చారా? ఎనిమిదేళ్ళ నుండి గుర్తుకురాని నేను ఇప్పుడెలా గుర్తుకొచ్చాను? .."గల్లాబట్టి నిలదియ్యాలన్నంత ఆవేశం పొంగింది. ఏదో అతీత శక్తి అడ్డుపడి నోరు తెరవనియ్యలేదు.

" మీ అమ్మగారు బావున్నారా? "

"మూడేళ్ళ క్రితమే మానాన్నను వెతుక్కుంటూ మా అమ్మ పోయింది"

"అరెరే... నా కా విషయమే తెలీదు. నువ్వు లెక్చరర్‌గా చేరినట్టూ, మీ అమ్మ నీతోనే ఉంటున్నట్టూ విన్నాను అంతే...."

"తెలిస్తే ఏంజేసేవారు" అనాలనుకుంది కాని తమాయించుకుంది.

ఓ నిముషమాగి

"మీ రెండో భార్యా, పిల్లలూ, అత్తయ్యా మామయ్యలూ బావున్నారా? ఇంతకూ మీకెందరు పిల్లలూ?" అడిగింది-ఆసక్తినాపుకోలేక.

"అదంతా ఎందుకులే హైమా! చేసుకున్నోడికి చేసుకున్నంత మహదేవా అని ఊరికే అన్నారా?"

"అంటే........!?"

"అమ్మా నాన్నలు తీర్థ యాత్రలకు వెళ్తూ ఆక్సిడెంట్‌లో మరణించారు."

"అయ్యో! అలాగా! అప్పుడైనా నాకో ఉత్తరం రాయలేక పోయారా? మన అనుబంధాలు అప్పుడే అవహేళనకు గురైనాయా?" అంది హైమవతి. ఆవిడ కడుపులో దేవినట్లవుతుంది- విషయాలు విన్నాక.

"మరి....మీ ముద్దుల భార్యా...." ఆతృతగా అడిగింది సగమే.

"అమ్మా నాన్నల కంటే ముందే పోయింది."

"అదెలా....?"

"పోయిందంటే...లేచిపోయింది." హైమవతి కళ్ళలోకి దీనంగాచూస్తూ "నాతో పెళ్ళయిన అర్నెల్లకే ఓ బాబును కని మా పరువు బజారుపాలు చేసింది. ఆ మనోవేదన నుండి విముక్తి పొందేందుకే అమ్మానాన్నలు తీర్థయాత్రలకు బయల్దేరారు. వాళ్లు బయల్దేరిన మర్నాడే ఆవిడ తన పాత ప్రియునితో, మా నగల్తో లేచిపోయింది." చెప్పుకుపోయాడు. తల నేలకు దించాడు కను కొలుకుల్లో బిందు రూపం దాల్చిన రెండు కన్నీటి బొట్లు నేల రాలి మెరుస్తున్నాయి.

"మరి.... మూడో పెళ్ళి" ఇంకేదో కూపీ లాగాలనుకుంది, ఉడుకుమోత్తనం.

"ఇంకా మూడోపెళ్ళా? నీకు చేసిన అన్యాయమే శాపమై దహించేస్తుంది. మాకు తగిన శాస్తి జరిగింది. క్షమించుమని నిన్నడిగే అర్హత కూడా కోల్పోయాను. కాని చేసిన పాపం చెప్పుకుంటే పోతుందంటారు పెద్దలు. అందుకే

వచ్చాను. నిజంగా పెద్దల మాట చద్దిమూటే కదూ!" అంటూ లేవబోతున్న ఆతని భుజాలమీద చేతులేసి కూర్చో పెట్టింది.

"నిజమే.... ఆరోజు అత్తయ్యా మావయ్యా చెప్పిన మాటలు మనం వినుంటే ఎంత బావుండేదో...!" అంది. ఆతని ఒడిలో ఒదిగి పోవాలని ప్రయత్నిస్తూ.

ఇప్పట్నుంచీ పెద్దలమాట ముద్దులమూట అనుకున్నారు గూడా.

ఇద్దరి హృదయ తంత్రుల్లో ఒకసారి దివ్యానుభూతి ఉదయించి ఏకం చేసింది. *

( జాగృతి 2-8 సెప్టెంబర్ 1991 )